క్లుప్తంగా

ప్రధాని మోదీని కలిసిన ఎమ్మెల్యే 'పాల్వాయి'


సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌజ్‌లో గల ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు కలుసుకున్నారు. ఈసందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానమంత్రికి రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

కేజీబీవీ తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఎంపీడీవో అల్బర్ట్ తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల డైనింగ్ హాల్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ గది, లైబ్రరీ పరిశీలించారు. పాఠశాలలో చేతి పంపుకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు ఎంపీడీవోను కోరారు. ఆయన వెంట ఎస్‌వో కవిత ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


జైహింద్‌పూర్ బీట్‌లో కనిపించిన పులి అడుగు

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలోని సలుగుపెల్లి, జైహింద్‌పూర్ బీట్లలో పెద్దపులి సంచరిస్తుందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీట్ అధికారి మురళి అన్నారు. సలుగుపల్లి గ్రామానికి చెందిన మహిళ కూలీలు అటవీ సమీపంలోని పత్తి పంట చేనులో పత్తి ఏరుతుండగా బుధవారం వారికి అవగాహన కల్పించారు. సలుగుపెల్లి, జైహింద్‌పూర్, సులుగుపల్లి, అందుగులగూడా తదితర గ్రామాలకు చెందిన రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెజ్జూర్ రేంజ్ అధికారి మునవిర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, దివంగత బీఆర్ఎస్ పార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మహమూద్ 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎంఎం. హెల్ప్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అహ్మద్, డాక్టర్ పవన్, నాయకులు సయ్యద్ అన్సార్, జాకీర్‌హుస్సేన్, సుధాకర్, ముజాహిద్, ఇమ్రాన్, గౌస్‌ఖాన్, ఖలీల్, మతీన్, శ్రీను, మున్న తదితరులు పాల్గొన్నారు.

'బాల్ వివాహ్ ముక్త్ భారత్'కు మహేశ్


కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్

ఆసిఫాబాద్: ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ పాల్గొన్నారు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మహేశ్ తెలిపారు.

'ప్రజలను ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్'

కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి అరిగోస పెడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి సంస్థాగత కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, విద్యార్థుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ అరెస్టులు చేస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకులు, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.


సైకత లింగం వద్ద మంగళహారతి ఇస్తున్న మహిళలు


గంగపూజ చేస్తున్న భక్తులు


సైకత లింగం వద్ద పూజల్లో మహిళలు


ఎడ్ల బండ్లపై పెద్దవాగుకు వెళ్తున్న భక్తులు

లగ్గాంలో కార్తీక సందడి

కార్తికమాసం పురస్కరించుకుని దహెగాం మండలంలోని లగ్గాం గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉమాచంద్రశేఖర ఆలయం నుంచి ఎడ్లబండ్ల ద్వారా బ్యాండు మేళాలతో గ్రామ సమీపంలోని పెద్దవాగుకు వెళ్లి గంగస్నానాలు ఆచరించారు. అనంతరం వేదపండితుడు శ్రీకాంతచారి ఆధ్వర్యంలో గంగపూజ, గంగహారతి నిర్వహించి సైకత లింగం తయారు చేసి పూజలు చేశారు. అనంతరం అక్కడే వన భోజనాలు చేశారు. – దహెగాం

జీపీ భవన నిర్మాణాలు పూర్తయ్యేనా..?


కల్వాడలో అద్దె భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

- పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు
- ఈజీఎస్ కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు
- ఐదు జీపీలకు మంజూరు

దహెగాం: పాలనను ప్రజలకు చేరువ చేయడానికి గత ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేయడంతో పాటు పల్లెలు, తండాలను జీపీలుగా మార్చింది. చాలావరకు కొత్త పంచాయతీల్లో కొలువుదీరిన పాలకవర్గాలకు పక్కా భవనాలు లేక గత సర్పంచులు ఇబ్బందులు పడ్డారు. అదే క్రమంలో గత సంవత్సరం మండలంలో పలు కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. కాగా ప్రస్తుతం మండలంలో మరో ఐదు పంచాయతీలకు ఈజీఎస్ కింద పక్కా భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరు సరే కానీ పనులు పూర్తి చేస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో 24 గ్రామ పంచాయతీలు..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో కొత్తగా ఏర్పడిన జీపీలు 10 ఉన్నాయి. వీటికి పక్కా భవనాలు లేక పోవడంతో గ్రామాల్లోని అద్దె భవనాల్లో, పాఠశాల భవనాల్లో పంచాయతీ భవనాలుగా మార్పు చేసి కొనసాగించారు. గత సంవత్సరం కూడా ఈజీస్ కింద మండలంలోని గెర్రె, చౌక, బామానగర్, చినరాస్పెల్లి, పెసరికుంట పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. భవనాల నిర్మాణం కోసం స్థలాలను సైతం గుర్తించి పనులు ప్రారంభించారు. మండలంలోని బామానగర్ జీపీలో మాత్రమే పనులు ప్రారంభించి స్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. మిగతా చోట్ల పనులు ప్రారంభించలేదు. దీంతో గత పాలకవర్గం సభ్యులు పక్కా భవనంలో కార్యకలాపాలు కొనసాగించకుండానే పదవీ కాలం ముగిసింది.

ఐదు పంచాయతీలకు..

ప్రస్తుతం మండలంలో మరో ఐదు పంచాయతీలకు ఈజీఎస్ కింద పక్కా భవనాలు మంజూరయ్యాయి. మండలంలోని బొర్లకుంట, పీపీరావు కాలనీ, కల్వాడ, కర్జి, గెర్రె జీపీలకు ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి పంచాయతీలలో స్థలాలను గుర్తించినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం మంజూరైన జీపీ భవనాలే పూర్తి కాలేదు కొత్తగా మంజూరైన భవనాలు పూర్తవుతాయా అన్న అనుమానం మండల ప్రజల్లో నెలకొంది. ప్రభుత్వాలు పక్కా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నా కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు అసంపూర్తిగానే మిగిలిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బామానగర్ జీపీలో స్లాబ్ వరకు పనులు కొనసాగించి పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపి వేశారు. భవనాలను నిర్మించడానికి కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే ముందుకు రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలకు మంజూరైన పక్కా భవనాల నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తాం

దహెగాం మండలంలో కొత్తగా ఐదు పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద పక్కా భవనాలు మంజూరయ్యాయి. మంజూరైన భవన నిర్మాణాల కోసం స్థలాలను గుర్తించాం. త్వరలో పనులను ప్రారంభిస్తాం. గత సంవత్సరం మంజూరైన వాటి నిర్మాణాలు కూడా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. – ఆత్మారాం, పీఆర్ ఏఈ

'మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'


మాట్లాడుతున్న హర్షత్ హుస్సేన్

బెజ్జూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థిని శైలజ ఆసుపత్రిలో మృతిచెందడానికి మంత్రి సీతక్క కారణమంటూ బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆరోపించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని శైలజ మృతిచెందగా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారని, జిల్లా మంత్రి సీతక్క ఫోన్‌లో మాట్లాడి వారికి ప్రభుత్వం తరఫున ఖర్చులకు రూ.1లక్ష 50వేలు అందజేశారన్నారు. కలెక్టర్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ ప్రొసిడింగ్ ఆర్డర్ సైతం అందజేశారన్నారు. నాయకులు పెంటన్న, నీలయ్య, పోశం, రాజేశ్, శ్రీహరి, భీమయ్య, సంజీవ్, తిరుపతి, మల్లేశ్, సల్మాన్ ఖాన్, చారి, చటారి బక్కన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులు వడ్డీ రాయితీ పొందండి'


మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ శ్రీపాద్

కెరమెరి: వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీని పొందాలని కెరమెరి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రీపాద్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద సాకడ గ్రామంలో అక్షరాస్యతపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకులు పనిచేస్తున్నాయని, వీటి సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నామని, ఖాతాదారులు వ్యక్తిగత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీలు తీసుకున్న రుణాలను చెల్లిస్తే తిరిగి బ్యాంకు రెట్టింపు రుణాలు అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో సైబర్ నేరాలు, మొబైల్ బ్యాంకింగ్, ఓటీపీ నంబర్ తదితర అంశాలపై కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీవోఏ రమేశ్, గ్రామ పటేల్ సోనేరావు, రైతులు మహిళలు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల బంద్ సంపూర్ణం


కౌటాల: పాఠశాలలను బంద్ చేయిస్తున్న నాయకులు


కెరమెరిలో మౌనం పాటిస్తున్న విద్యార్థులు

కౌటాల: హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థిని శైలజ మృతికి నిరసనగా మంగళవారం విద్యార్థి సంఘాల పిలుపు మేరకు మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు బంద్ పాటించాయి. మండలంలోని తలోడి, గురుడుపేట, ధనుర్‌హెట్టి, తదితర పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. మాలి సంఘం మండల యువజన నాయకులు మోర్లె పాండురంగ్, ముక్తేశ్వర్, సంతోష్, మొండి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో పాక్షికం..

కెరమెరి: వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శైలజ ఫుడ్‌పాయిజన్ జరిగి ఇటీవల మృతి చెందడంతో విద్యార్థి సంఘాలు, మాలిసంఘం నాయకులు బుధవారం ఇచ్చిన పాఠశాలల బంద్ మండలంలో పాక్షికంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కరన్, బాలాజీ, శ్రీనివాస్, మాలి సంఘం నాయకులు కొట్రంగే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'కారకులను విధుల్లో నుంచి తొలగించాలి'

రెబ్బెన: వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన శైలజ మృతికి కారణమైన అధికారులను విధుల్లో నుంచి తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. విద్యార్థిని మృతికి నిరసనగా బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ మండలంలో సంపూర్ణమైంది. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు వెళ్లి బంద్ పాటించాలని పాఠశాల యాజమాన్యాలను కోరి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సతీశ్, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, మండల అధ్యక్షుడు జాడి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులకు కంపెనీ క్వార్టర్ల కేటాయింపును పారదర్శకంగా చేపడుతున్నామని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో క్వార్టర్ల కోసం దరఖాస్తు చేస్తున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల దరఖాస్తులను పరిశీలించి క్వాటర్ల కేటాయింపు కోసం అర్హతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్వాటర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. ఉద్యోగులు క్వార్టర్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సీనియారిటీ ప్రతిపాదికన క్వాటర్ల కేటాయింపు జరుగుతుందని అర్హులైన ప్రతీ ఉద్యోగికి ఖాళీ క్వాటర్లను కేటాయిస్తున్నామన్నారు. సివిల్ ఎస్ఈ మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అర్చన పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో కార్మికులను నియమించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

రెబ్బెన: గోలేటి సీహెచ్‌పీలో సరిపడా సిబ్బందిని నియమించాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్ రావులు అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ బాయిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే లక్ష్యంతో ఐఎన్‌టీయూసీ బాయిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్మికులకు ప్లేడేలు అందేలా చూడాలని ఇంజనీర్ శ్రావణ్‌ను కలిసి కోరారు. కార్యక్రమాల్లో ఏరియా కార్యదర్శి మాసాడి నారాయణ, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గోలెం గట్టయ్య, సెంట్రల్ కమిటీ నాయకులు రాజన్న, ఈశ్వర్, కృష్ణ నాయకులు అర్జయ్య, కిషన్, సత్యనారాయణ, రాజయ్య, సదానందం, సంతోష్, మహేందర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదు'


మాట్లాడుతున్న కొడప శంకర్

బెజ్జూర్: టైగర్ కారిడార్ పేరిట ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని మండల సార్మేడి కొడప శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు ఫారెస్ట్ డివిజన్‌లో టైగర్ కారిడార్ పేరిట అమాయక ఆదివాసీలను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఫారెస్ట్ అధికారులు గ్రామసభలు నిర్వహించకుండా ఏకపక్షంగా తీర్మానాలు తీసుకొని గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి చర్యలను మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కొలవార్ ఉపాధ్యక్షుడు మానెపెల్లి మల్లేశ్, కొలవార్ జిల్లా సహాయక కార్యదర్శి, తుడుందెబ్బ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పోల్క వెంకటేష్, ఆదివాసీ నాయకులు తొర్రెం ప్రశాంత్, పోర్తేటి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయాలి


పంట వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కౌటాల: రైతులు పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో పలు పంటలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఈవోలు పకడ్బందీగా పంటల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పంటల వివరాలను నమోదు చేస్తే ధాన్యం విక్రయానికి సులువుగా ఉంటుందని తెలిపారు. యాసంగిలో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలను సాగు చేయాలన్నారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈవోలు చౌదరి అంజన్న, ఘన్‌శ్యాం, కవిత తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్థిక, సామాజిక, కుల గణన సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు చేయాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఎంఆర్‌సీ సెంటర్, ఏకలవ్య మోడల్ పాఠశాలలో చేపడుతున్న సర్వే ఆన్‌లైన్ పనులను ఆయన ఎంపీడీవో జవహర్‌తో కలిసి పరిశీలించారు. ఆన్‌లైన్ వివరాల నమోదులో వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో స్వప్నశీల, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

నార్నూర్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో జవహర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో భోజనానికి వాడే సరకుల విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయుడు ఉన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో శాలువాతో సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.